క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి గురువారం దేవస్థానం అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై ప్రకాశం జిల్లాకు చెందిన కె.బుచ్చేశ్వరరావు బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. మూషికవాహన, శివపంచాక్షరి, బ్రహ్మాంజలి, లింగాష్టకం, నటరాజస్తుతి, దేవిస్తుతి, నమశ్శివాయతే తదితర గీతాలకు మోక్షికాభ్యశ్రీ, దీక్షితారెడ్డి, ప్రణవి, ప్రగతి, రూపశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

చదువుతో ఉజ్వల భవిత



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితప్రభావతి అన్నారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మిట్టకందాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆట, పాట, ఆచరణలో బాలికలు ముందుండాలన్నారు. బాలికలను బాలురతో సమానంగా చదివివచాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, సుజాత, అరుణమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు



బియ్యం, కందిపప్పు అందిస్తున్న డీటీలు

పాములపాడు: నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నందున ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకే బియ్యం, కందిపప్పు అందజేస్తున్నట్లు సీఎస్ డీటీ శ్రీనివాసులు, డీటీ పఠాన్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిలో కందిపప్పు రూ.160, కిలో బియ్యం (సోనమసూరి) రూ.48 చొప్పున ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ 5 కేజీల చొప్పున బియ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో ముర్తుజావలి పాల్గొన్నారు.

చలువ పందిళ్ల తొలగింపు



చలువ పందిళ్లను తొలగిస్తున్న కూలీలు

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతం కృష్ణానదీ తీరాన వెలసిన సంగమేశ్వరాలయం వద్ద వేసవి తాపం నుంచి భక్తులు సేదతీరేందుకు వేసిన చలువ పందిళ్లను గురువారం ఆలయ పురోహితులు ఆధ్వర్యంలో తొలిగించారు. వర్షాలు పడుతుండడం, ఎగువ నుంచి శ్రీశైలం జలాశయం నుంచి స్వల్పంగా వరద జలాలు వస్తుండడంతో సంగమేశ్వరాలయ ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లను తొలిగిస్తున్నట్లు పురోహితులు తెలిపారు.

విద్యా బోధనను గమనించాలి

నందికొట్కూరు: తరగతి గదిలో ఉపాధ్యాయుల విద్యా బోధనను హెచ్‌ఎంలు గమనించాలని ఎంఈఓ, కోర్స్ కోఆర్డినేటర్ సుభాన్ సూచించారు. హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ ప్రారంభమైంది. సమగ్ర శిక్షా-సెక్టార్-1 ఆధ్వర్యంలో తొమ్మిది మండలాల ఉపాధ్యాయులకు క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ బేస్డ్ ఆన్ టీచ్ టూల్ ప్రోగ్రామ్‌పై మాస్టర్ ట్రైనర్లు రామ్మోహన్, వెంకటరమణ, మల్లికార్జునగౌడు, మధునాయుడు శిక్షణ ఇచ్చారు. బోధనలో నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష



హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు



నందికొట్కూర్‌లో..

ఆత్మకూరు: అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రానాలు కాపాడుతుందని అడ్వకేట్లు మాణిక్యాలరావు, బ్రతుకులయ్య, హుసేన్‌మియా, మాబుబాషా, భాస్కర్ అన్నారు. గురువారం హైకోర్టు ఆదేశాల మేరకు సీనియర్ సివిల్‌జడ్జి ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలోని పాత బస్టాండు నుంచి గౌడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. యువత బైక్‌లపై అతివేగంగా వెళ్తుంటారని, అనుకోని ప్రమాదాలు జరిగితే ప్రాణాలకు ముప్పు అని హెచ్చరించారు. హెల్మెట్ ధరించడంతో పాటు నిదానంగా వెళ్లాలని సూచించారు. ఇంటి నుంచి బయలుదేరే సమయంలో ఇంట్లో వాళ్లను గుర్తు చేసుకోవాలన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి

నందికొట్కూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను కచ్చితంగా వాడాలని టౌన్ ఎస్‌ఐ వెంకటరమణ సూచించారు. గురువారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ఏపీ రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రయదర్శిని ఉత్తర్వుల మేరకు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలంటూ రోడ్డు షో, ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయడమంటే ప్రాణాలతో చెలగాటమాడటమేనన్నారు. ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవాలంటే తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రహంతుల్లాబేగ్, శ్రీనివాసులు, మద్దయ్య, భాస్కర్, స్వామిరెడ్డి, జనార్దన్‌రావు, వెంకటేశ్వర్లు, సోషల్ వర్కర్ శోభరాణి పాల్గొన్నారు.

లైసెన్స్ డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి

- ఏడీఏ ఆంజనేయ



పాములపాడు మన గ్రోమోర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పలు పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు నాసిరకం ఎరువులు, నకిలీ విత్తనాలు అంటగడితే చర్యలు తప్పవని దుకాణాదారులను హెచ్చరించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. కొందరు కోబ్రా విషపు గుళికల ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పట్టుబడితే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తుమ్మలూరు, జూటూరు ఆర్బీకే కేంద్రాలను తనిఖీ చేశారు. సీసీఆర్ కార్డులు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి ఉన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ప్రతిభను తెలుసుకుంటున్న ఎంపీడీఓ సరస్వతి

పాములపాడు: వర్షాలు కురుస్తున్నందున వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సరస్వతి సూచించారు. గురువారం మండలంలోని జూటూరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరు పట్టిక, మూమెంట్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. సమయ పాలన పాటించాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు సానుకూలంగా సమాధానం చెబుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను, ఆహార పదార్థాల నిల్వ వివరాలు పరిశీలించారు. విద్యార్థుల చేత మ్యాప్‌లో ఉన్న అక్షరాలను గుర్తింపచేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, అంగన్‌వాడీ టీచర్ వకుల ఉన్నారు.

'అన్నదాత సుఖీభవ'ను అమలు చేయాలి



మల్యాల కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఫక్కీర్‌సాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మల్యాల, అల్లూరు సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకుమ పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఆర్థిక సాయం తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాబాషా, నారాయణ, చిన్న సవారి, రోషన్, భూషన్న, షేక్షావలి, అనురాధ, లక్ష్మీదేవి, బాలమ్మ పాల్గొన్నారు.


గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ, నాగలూటి, సంజీవనగర్ తండాల్లోని గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు. రక్త, మూత్ర పరీక్షలతో పాటు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. రక్తశాతం తక్కువగా ఉన్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇచ్చారు. గర్భినులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి పవన్‌కుమార్ గర్భిణులకు సూచించారు. వెంకటాపురం గ్రామంలో జరుగుతున్న కుష్టువ్యాధి సర్వే కార్యక్రమాన్ని డాక్టర్ గోపాల్ పర్యవేక్షించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కుద్దుష్, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, స్టాఫ్ నర్స్ సఫీమున్నీసా, ల్యాబ్ టెక్నీషియన్ సామేశ్వరి, సీహెచ్‌ఓలు దీపికాభాయి, యశోద, ఆరోగ్య కార్యకర్తలు బేబిజ్యోతి, పద్మావతి, శారద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దుప్పికి గాయాలు



గాయపడిన దుప్పి

మహానంది: చుక్కల దుప్పి నీటి కోసం గురువారం తెలుగు గంగ కాల్వ వద్దకు వచ్చి గాయాలపాలైంది. నీళ్లు తాగేందుకు కాలువలోకి దిగిన దుప్పి.. ఆ తర్వాత పైకి ఎక్కేక్రమంలో పట్టుతప్పి కిందపడటంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్‌లు చుక్కల దుప్పిని తిమ్మాపురంలోని పశువైద్యశాలకు తీసుకొచ్చారు. పశువైద్యాధికారి కరుణాకర్, సిబ్బంది వైద్యసేవలు అందించారు. కోలుకున్న తర్వాత నల్లమల అడవిలో వదిలేస్తామని అధికారులు తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

మిడుతూరు: సర్వశిక్ష అభియాన్ ద్వారా మంజూరైన నోట్ పుస్తకాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ గురువారం అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకర్, లైబ్రేరియన్ తిరుమలేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బాలికల విద్య, భద్రతపై అవగాహన కల్పించాలి

మహానంది: బాలికల విద్య, భద్రత అంశాలపై చిన్నారులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి సూచించారు. బండిఆత్మకూరు మండల కేంద్రంతో పాటు నారపురెడ్డికుంట, నెమళ్లకుంట, నాయిని చెరువు చెంచుగూడేల్లో గురువారం భేటీ పడావో... భేటీ బచావో కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. తిరుపతికి చెందిన వరల్డ్ విజన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చెంచుగూడెంలోని గిరిజనుల సమస్యలు, అవసరాలు, ఆరోగ్యం, భద్రత, విద్య, జీవనోపాధి స్థితిగతులపై చర్చించి వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, డాక్టర్ దినేష్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెరిపివ్వని వర్షం

ఆత్మకూరు: మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నాలుగు రోజులుగా వర్షం కుస్తుండటంతో పైర్లు దెబ్బ తింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇప్పటికే సాధారణ వర్షపాతం 167 మి.మీ. దాటింది. మరో పది రోజుల వరకు వర్షాలున్నాయని అధికారులు చెబుతుండటంతో రైతుల పరిస్థితి ఆందోళనకంగా మారింది.

నూతన కమిటీ ఏర్పాటు

జూపాడుబంగ్లా: స్థానిక ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతుల నూతన కమిటీ గురువారం ఏర్పాటైంది. కమిటీ గౌరవ అధ్యక్షునిగా మండడి వెంకటరమణారెడ్డి, అధ్యక్షునిగా కుర్వ మల్లయ్య, ఉపాధ్యక్షునిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా హుసేన్‌బాషా, ట్రెజరర్ మల్లెపోగు దాసుతోపాటు మరో ఆరుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరికి మద్దతుగా రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకానికున్న ఐదు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని బాగు చేయించుకునే స్తోమత రైతులకు లేదన్నారు. దాదాపు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని, కలెక్టర్ స్పందించి మోటార్లను బాగు చేయించాలని కోరారు.

నేడు అంకాళమ్మకు బోనం సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి ఆషాడమాస మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం దేవస్థానం తరపున బోనం సమర్పించనున్నట్లు ఈఓ డి.పెద్దిరాజు గురువారం తెలిపారు.

సీసీఆర్ కార్డులు తీసుకోవాలి

మహానంది: పొలాలను కౌలుకు తీసుకున్న ప్రతి రైతు సీసీఆర్ కార్డులు తీసుకోవాలని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని సూచించారు. తిమ్మాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కౌలురైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ యశస్విని మాట్లాడుతూ బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు, పంట బీమా, పంట నష్టం, కనీస మద్దతు ధర తదితర వాటి కోసం సీసీఆర్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ కౌలురైతులు వారు సాగు చేస్తున్న పొలాలకు సంబంధించిన యజమాని పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, జిరాక్స్ ప్రతులను తీసుకుని రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ అధికారిని కలిసి ఇవ్వాలన్నారు. కౌలుకార్డు ఆధారంగా కౌలు రైతు పేరు మీదనే పంట నమోదు చేస్తామన్నారు. తహసీల్దార్ రామచంద్రుడు పాల్గొని పలువురు రైతులకు కౌలుకార్డులు అందించారు.

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పర్యవేక్షకులకు ప్రస్తుతం వారు విధులు నిర్వహిస్తున్న విధులతో పాటు అదనంగా మరో విధులు కేటాయించారు. ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లకు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు, ఆరుగురు రికార్డు అసిస్టెంట్లకు, పలువురు అటెండర్లకు, కాంట్రాక్ట్ లేబర్లకు అంతర్గత బదిలీలు నిర్వహించారు. మరో 20 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థాన పరిపాలన సౌలభ్యం కోసమే అంతర్గత బదిలీలు చేపట్టినట్లు ఈఓ తెలిపారు. కేటాయించిన విధుల్లో ఉద్యోగులు వెంటనే చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కార్డులు సద్వినియోగం చేసుకోవాలి

జూపాడుబంగ్లా: కౌలురైతులు కౌలు గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం తంగడంచ రైతుసేవా కేంద్రంలో కౌలు కార్డు ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఆట, పాటలతోనే విద్య

మిడుతూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతోనే విద్యను అందిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని అలగనూరు గ్రామంలో బాల సభ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆశాడమాస పూజలు



శాకాంబరి అలంకరణలో అమ్మవారు

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలోని అంకాల పరమేశ్వరి దేవి ఆలయంలో ఆషాఢ మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బాధ్యతల స్వీకరణ



సీఐ బీఆర్ కృష్ణయ్య

నందికొట్కూరు: రూరల్ సీఐగా బీఆర్ కృష్ణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం గడపాలని సూచించారు.

రాళ్ల దాడి పిరికిపందల చర్య



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్

నందికొట్కూరు: చిత్తూరు ఎంపీ మిథున్‌రెడ్డిపై రాళ్ల దాడి పిరికిపందల చర్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. గురువారం పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. అధికార మదంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతుండటం దుర్మార్గమన్నారు. పుంగనూర్‌లో రెడ్డప్పను పరామర్శించేందుకు వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ నాయకులు రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. టీడీపీ నేతలు రోడ్లపై కత్తులతో తిరుగుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత ఏమి చేస్తున్నారన్నారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను అతి కిరాతకంగా పట్టపగలే నరికేస్తుంటే ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామకృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, అబుబక్కర్ పాల్గొన్నారు.

చిరుతను బంధించేందుకు చర్యలు తీసుకోవాలి

- ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని



మాట్లాడుతున్న ఎంపీపీ యశస్విని

మహానంది: మహానంది పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతను బంధించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని కోరారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చిరుతను బంధించి ఇక్కడి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీఎఫ్‌ఓ శివశంకర్‌రెడ్డిలకు లేఖ రాస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ యశస్విని మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా పైపుల లీకేజీ ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు పనులు ఉంటే చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతివారం తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఏఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఇప్పటి వరకు 330 క్వింటాళ్ల జీలుగలు, 4.96 క్వింటాళ్ల పిల్లిపెసర పంపిణీ చేసినట్లు చెప్పారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షురాళ్లు కుంచపు లక్ష్మీనరసమ్మ, బండి సరస్వతి, తహసీల్దార్ రామచంద్రుడు, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి విశేషపూజలు



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. త్రయోదశిని పురస్కరించుకుని గురువారం 19 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామికి విశేషపూజను జరిపించుకున్నారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి పంచామృతాలతో, ఫలోదకాలతో, మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలి

- నందికొట్కూర్ ఎమ్మెల్యే జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (సంతపేట)ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు చదువుకోవడానికి పేద పిల్లలే వస్తారని, వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని వంట నిర్వాహకులను ఆదేశించారు.

కౌలు కార్డులు ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న ఏపీ కౌలు రైతుసంఘం నాయకులు

ఆత్మకూరు: భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి వీరన్న కోరారు. గురువారం మండలంలోని బాపనంతపురం గ్రామ సచివాలయంలో కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ కింద తక్షణమే రూ.20 వేలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిలుల్లు చెలిలచి, ఉపాధి పనులు 200 రోజులకు పెంచాలన్నారు. బాపనంతపురం గ్రామరైతులు ఎస్.రాముడు, కె.కోటేశ్వర్‌రెడ్డి, ఎస్.నాగిరెడ్డి, పుల్లయ్య, ఎల్లయ్య, శివారెడ్డి, వెంకటేశ్వర్లు, యేసన్న పాల్గొన్నారు.

- మహానంది: కౌలురైతులకు భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామసభల ద్వారా గుర్తించి కౌలుకార్డులు అందించాలని బండిఆత్మకూరు మండల రైతుసంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్నపల్లె సచివాలయం ముందు గురువారం ఆయన రైతులతో కలిసి ధర్నా నిర్వహించి కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

కుష్టు నిర్మూలనపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మోహన్

పగిడ్యాల: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనపై గురువారం పాత ముచ్చుమర్రిలో వైద్యాధికారి మోహన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కుష్టు రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు, చర్మం పొడిగా ఉండడం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామగురప్ప, సచివాలయ ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

20 నుంచి ఏఐకేఎంఎస్ సమావేశాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఈనెల 20 కర్నూలు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.నరసింహులు కోరారు. గురువారం ఆత్మకూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు చేష్టలుడిగి చూస్తున్నాయన్నారు. పంట రుణాలతో పాటు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలని, గుబడులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పంటలకు బీమా కల్పించి రైతన్నలను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బి.గోపాల్, రవికుమార్, గోపాల్, నూర్‌అహ్మద్, హాజీ, గోపాల్, ఆసీఫ్, మోజెస్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: బాల, బాలికల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పావనిరెడ్డి, నిర్మలమ్మ సూచించారు. గురువారం మండలంలోని జూపాడుబంగ్లా అంగన్‌వాడీ కేంద్రం-1, పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బాల, బాలికలు, గర్భిణులు, బాలింతలకు మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, యూవ్‌టీజింగ్, సామాజిక స్పృహ కలిగి ఉండటం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్లు వెంకటరమణమ్మ, భారతమ్మ, అరుణకుమారి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభలు

కొత్తపల్లి: నందికుంట, ఎదురుపాడు, ఎర్రమఠం గ్రామాల్లో గురువారం సామాజిక తనిఖీ గ్రామసభలను ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. తనిఖీ బృందాలు ఏఏ గ్రామంలో ఎన్ని పనులు జరిగాయి, ఎంత ఖర్చు అయింది, వేతనాలు ప్రజలకు చేరాయా, పనుల్లో కొలతలు సరిగ్గా ఉన్నాయా లేదా తదితర సమాచారాన్ని ప్రజలకు వివరించారు. నందికుంట గ్రామ సర్పంచు నిత్యలక్ష్మీదేవి పాల్గొన్నారు.